సాక్షి
ఆదిలాబాద్
గురువారం ׀ 2 ׀ మార్చి ׀ 2023



మీలాంటి టీచర్లు అవసరం..

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రంగయ్య హైదరాబాద్‌లో సార్ సినిమా డైరెక్టర్ వెంకీ అట్లూరిని కలిశారు. రంగయ్యను సన్మానించారు. 10లో▸



తిప్పేశ్వర్‌కు చేరిన పులులు

ఇటీవల ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం గొల్లఘాట్ శివారులో సంచరించిన నాలుగు పులులు ఎట్టకేలకు తిప్పేశ్వర్‌కు చేరాయి. ఈమేరకు అటవీ అధికారులు ధ్రువీకరించారు. 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
36.0/21.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమ శాతం తగ్గనుంది. మధ్యాహ్నం ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

10న 'స్వగృహ' వేలంపై ప్రీ బిడ్ సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: రాజీవ్ స్వగృహ అగ్రజ టౌన్‌షిప్ ఓపెన్ ప్లాట్ల వేలం ప్రక్రియపై ఈనెల 10న జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ప్రీబిడ్ సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషాతో కలిసి స్వగృహ ప్లాట్ల వేలం ప్రక్రియపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. గతేడాది నవంబర్‌లో నిర్వహించిన వేలంలో పాడి, డబ్బులు చెల్లించకుండా మిగిలిపోయిన ప్లాట్లకు ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరిగి బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. వేలంపై అవగాహన, అనుమానాల నివృత్తి కోసం ప్రీబిడ్ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. 58 ప్లాట్లకు ఈ నెల 17న బహిరంగ వేలం ఉంటుందని తెలిపారు. ఈమేరకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొని ఎలాంటి చిక్కులు లేని ప్లాట్లను సొంతం చేసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శైలజ, హౌసింగ్ నోడల్ ఆఫీసర్ బసవేశ్వర్, మావల తహసీల్దార్ వనజ, టీపీఎస్ సాయికిరణ్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రాజేశ్వర్, టీఎస్ఐఐసీ జేఈ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బోథ్ సీహెచ్‌సీని 100 పడకలకు పెంచాలని వినతి



మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే బాపూరావ్

బోథ్: నియోజకవర్గంలోని సీహెచ్‌సీని 100 పడకలకు పెంచాలని కోరుతూ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రి హరీశ్‌రావును కలిసి విన్నవించారు. అలాగే నియోజకవర్గానికి ఆశ వర్కర్ల పోస్టులు పెంచాలని, తాంసి మండలానికి 108 అంబులెన్స్, బోథ్‌లోని సాయినగర్, సిరికొండ మండల కేంద్రాలకు నూతన పీహెచ్‌సీలు మంజూరు చేయాలని కోరగా.. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

'సామాన్యుడి నడ్డి విరుస్తున్న కేంద్రం'

ఆదిలాబాద్‌టౌన్: మరోసారి వంటగ్యాస్ ధర పెంచిన కేంద్రం సామాన్యుడి నడ్డి విరుస్తోందని ఎమ్మెల్యే జోగు రామన్న ప్రకటనలో పేర్కొన్నారు. వంటగ్యాస్ ధర పెంపు నిర్ణయాన్ని ఆయన ఖండించారు. బీజేపీ ఎనిమిదేళ్ల పాలనలో వంట గ్యాస్ ధర 138 శాతం పెంచిందని పేర్కొన్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసరాలతో పేద, మధ్యతరగతి జనం ఇబ్బందులు పడుతుండగా తాజాగా గ్యాస్ పెంపు వారిపై మరింత భారం పడనుందని తెలిపారు. పెంచిన వంట గ్యాస్ ధర తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని వెల్లడించారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

ఎదులాపురం: సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్‌సింగ్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన రాడ్ బైండింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో మాట్లాడారు. వేసవి దృష్ట్యా కూలీ అడ్డాల వద్ద టెంట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాడ్ బైండింగ్ యూనియన్ నాయకులు ఉమ్రే నితిన్, కార్మికులు ఉమ్రే సంభ్, శంకర్, మిలన్, రాజేశ్వర్, మారుతి రావు, సాయి, దుర్గ, రవి పాల్గొన్నారు.

సిలిండర్!



జిల్లాలో వంట గ్యాస్ కనెక్షన్ల వివరాలు :

కనెక్షన్ రకం	కనెక్షన్లు	కంపెనీ వారీగా ఏజెన్సీలు
జనరల్	1,39,085	ఐఓసీ 04
దీపం	40,701	బీపీసీ 02
ఉజ్వల	36,098	హెచ్‌పీసీఎల్ 11

ఇదివరకు గృహావసర ఎల్పీజీ ధర	రూ.1,132
తాజా పెంపుతో పెరిగిన ధర	రూ.1,182

- మళ్లీ పెరిగిన వంట గ్యాస్ ధర
- గృహావసర సిలిండర్‌పై రూ.50 పెంపు
- ఇదివరకే సబ్సిడీల ఎత్తివేత
- లబోదిబోమంటున్న వినియోగదారులు
- జిల్లావాసులపై నెలకు రూ.కోటికిపైగా అదనపు భారం

కైలాస్‌నగర్: వంట గ్యాస్ సిలిండర్ ధర మళ్లీ భగ్గుమంది. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతుండగా మరోసారి సామాన్యుడి నడ్డి విరిచేలా గ్యాస్ బండ గుదిబండగా మారింది. గృహావసర సిలిండర్ ధర మరో రూ.50 పెంచుతున్నట్లు నిర్ణయించిన కేంద్ర చమురు సంస్థలు దాన్ని బుధవారం నుంచి అమల్లోకి తీసుకువచ్చాయి. దీంతో పేద, మధ్యతరగతిపై మరింత అదనపు భారం పడనుంది. మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా ఇప్పటికే వంట గ్యాస్‌పై సబ్సిడీలను ఎత్తివేసిన కేంద్రం.. మరోసారి ధరల పెంపు నిర్ణయంపై సామాన్యుల్లో ఆగ్రహం వ్యక్తమవుతుంది. పెరిగిన ధరతో జిల్లాలోని గ్యాస్ వినియోగదారులపై నెలకు సుమారు రూ.కోటికి పైగా అదనపు భారం పడనుంది.

రూ.1.07 కోట్ల అదనపు భారం

గతేడాది జూలైలో వంట గ్యాస్ ధర పెంచిన కేంద్ర చమురు సంస్థలు తాజాగా ఈ ఏడాది ఆరంభంలోనే మరోసారి పెంచుతూ అమల్లోకి తీసుకొచ్చాయి. గృహావసరానికి వినియోగించే 14.2 కిలోల సిలిండర్‌పై రూ.50 అదనంగా బాదాయి. జిల్లావ్యాప్తంగా 17 గ్యాస్ ఏజెన్సీలుండగా వాటి పరిధిలో 2,15,884 వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. సగటున నెలకు ఒక్కో కనెక్షన్‌పై ఒక సిలిండర్‌ను వినియోగించినా ప్రతీ నెల రూ.1,07,94,200 అదనపు భారం వినియోగదారులపై పడనుంది. ఇప్పటికే పెరిగిన నిత్యావసరాల ధరలు సామాన్యుడి బడ్జెట్‌పై ప్రభావం చూపుతుండగా తాజాగా పెరిగిన గ్యాస్ ధర వారిపై మరింత అదనపు భారం పడనుంది.

సబ్సిడీల ఎత్తివేత

ఓ వైపు వంట గ్యాస్ సిలిండర్ ధర పదేపదే పెంచుతున్న కేంద్ర ప్రభుత్వం మరోవైపు వాటిపై ఇదివరకు ఇస్తున్న సబ్సిడీలను పూర్తిగా ఎత్తివేసింది. కరోనాకు ముందు గ్యాస్ సిలిండర్‌ను పొందిన వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో సబ్సిడీ నగదును జమ చేసేది. వైరస్ తగ్గుముఖం పట్టిన అనంతరం ఆర్థిక సంక్షోభం పేరిట ఆ సబ్సిడీలను పూర్తిగా రద్దు చేసింది. ప్రస్తుతం ఉజ్వల కనెక్షన్‌దారులకు మాత్రమే నామమాత్రంగా రూ.47 చొప్పున సబ్సిడీ విడుదల చేస్తోంది. అది కూడా తక్కువగా ఉండటంతో ఆ వినియోగదారులు సైతం దాన్ని పెద్దగా పట్టించుకోవడం లేదు. కేంద్ర నిర్ణయంపై వినియోగదారులు, ముఖ్యంగా మహిళలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెంచిన ధర వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు.

సామాన్యులపై మోయలేని భారం

పెరిగిన నిత్యావసర ధరలతో మధ్యతరగతి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. చాలీచాలని జీతంతో ఇల్లు గడవడం కష్టమవుతుంది. ఇప్పటికే గ్యాస్ సబ్సిడీ ఎత్తివేసిన కేంద్రం తాజాగా మళ్లీ ధర పెంచడం సరికాదు. మాలాంటి సామాన్యులకు ఇది మోయలేని భారమే. వెంటనే పెంచిన ధర తగ్గించడంతో పాటు గతంలో మాదిరిగా సబ్సిడీ అందించాలి.
– ఒరగంటి నవీన, గృహిణి, ఆదిలాబాద్

కమలం.. ఫోకస్



- జిల్లాపై దృష్టి సారించిన బీజేపీ అధిష్టానం
- ఈనెల 4న ఖరారైన 'బండి' పర్యటన
- ఢిల్లీ నుంచి రాగానే ఆదిలాబాద్‌లోనే తొలి సమావేశం
- సంస్థాగత పటిష్టత కోసం అంటున్న ఆ పార్టీ వర్గాలు

సాక్షి,ఆదిలాబాద్: జిల్లా బీజేపీలో ఏదో జరుగుతుందన్న చర్చ ఆ పార్టీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ప్రధానంగా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పర్యటన అకస్మాత్తుగా ఈ నెల 4న ఖరారు కావడమే ఆసక్తి కలిగిస్తుంది. ఢిల్లీ కోర్ కమిటీ సమావేశంలో పాల్గొని రాష్ట్రానికి తిరిగి వచ్చిన తర్వాత మొదటి సమావేశం ఆదిలాబాద్ నుంచే మొదలు పెడుతుండటమే కారణంగా తెలుస్తోంది. నియోజకవర్గాల వారీగా గత ఎన్నికల్లో ఎదురైన అనుభవాలను బేరీజు వేస్తూ అప్పుడు ఎదురైన లోపాలను అధిగమించడం ద్వారా ఇక్కడ ఎన్నికలకు పూర్తి స్థాయిలో పార్టీ పటిష్టం కావాలన్నది అధిష్టాన లక్ష్యం.

ఆ సామాజిక వర్గం నుంచి చేరికలు

లోపాలను అధిగమిచేందుకు ఓ సామాజిక వర్గం చేరికల మీద బీజేపీ అధిష్టానం ప్రధానంగా జిల్లాలో దృష్టి సారించినట్లు చర్చ సాగుతోంది. బండి సమక్షంలో ఆ సామాజికవర్గానికి చెందిన నాయకులతో పాటు ఇతరులు కూడా చేరుతున్నారని చర్చ సాగుతోంది. ప్రస్తుతం ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి పార్టీ పరంగా టికెట్ ఆశిస్తున్న వారిలో ఆ సామాజిక వర్గం లేకపోవడంతో ఒక వేళ ఇతర సామాజిక వర్గం నుంచి నేతలెవరైనా బరిలో ఉన్నా వారికి మద్దతుగా ఆ సామాజిక వర్గాన్ని పెద్ద ఎత్తున చేర్చుకోవడం ద్వారా ప్రధానంగా బీఆర్ఎస్‌కు చెక్ పెట్టాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

పార్టీకి మైలేజ్ పెరగాలి..

ప్రస్తుతం జిల్లాకు అధ్యక్షుడిగా పాయల్ శంకర్ వ్యవహరిస్తున్నారు. పార్టీకి ఆయన ఓ స్థాయిలో మైలేజ్ తీసుకువచ్చారని చర్చ ఉంది. అయితే దాన్ని మించి మరింత మైలేజ్ తీసుకురావాలని పార్టీ భావిస్తోంది. ప్రధానంగా అధిష్టానం క్షేత్ర స్థాయిలో పార్టీ పటిష్టతే లక్ష్యంగా ముందుకు వెళ్తుంది. ఇందులో భాగంగానే ఇటీవల శక్తి కార్నర్ సమావేశాలను ప్రతి స్ట్రీట్‌లో నిర్వహిస్తూ వచ్చింది. పర్యటనలో భాగంగా ప్రధానంగా వీటిపై సంజయ్ సమీక్షించనున్నట్లు తెలుస్తోంది. శక్తి కార్నర్ మీటింగ్‌లలో ప్రజల నుంచి అమితంగా ఆదరణ కనిపించినప్పటికీ పార్టీ సొమ్ము చేసుకోలేకపోతుందన్న ప్రచారం కార్యకర్తల్లో ఉంది. బూత్ కమిటీలు పూర్తి స్థాయిలో పటిష్టంగా లేవన్న అభిప్రాయం వారిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగానే అధికార పార్టీని ఢీకొనే స్థాయిలో వెనుకబడుతున్నామని చెప్పుకుంటున్నారు.

ఈ నేపథ్యంలో పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేసేందుకు జిల్లా స్థాయిలో ఏవైనా కీలక నిర్ణయాలు తీసుకునే విషయంలో ఈ పర్యటనలో బీజం పడుతుందా అనే చర్చకూడా లేకపోలేదు. ఈ పరిణామాలన్నీ పార్టీలో ఆసక్తి కలిగిస్తున్నాయి.

4న జిల్లాకు బండి సంజయ్ రాక



మాట్లాడుతున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఈనెల 4న జిల్లాకు రానున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. శనివారం ఉదయం 11 గంటలకు బండి సంజయ్ జిల్లాకు చేరుకుంటారని పేర్కొన్నారు. మావల జాతీయ రహదారి 44 నుంచి జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ కాలనీలో గల జనార్దన్‌రెడ్డి గార్డెన్ ఫంక్షన్‌హాల్ వరకు బైక్ ర్యాలీ ద్వారా స్వాగతం పలకనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కార్నర్ మీటింగ్‌పై సమీక్ష, పార్టీలో చేరనున్న పలువురికి ఆహ్వానం వంటి కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారన్నారు. ఈ పర్యటనను విజయవంతం చేసేలా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు జోగు రవి, దినేష్ మటోలియా, ప్రవీణ్, విజయ్ బోయర్, మయూర్ చంద్ర, ప్రవీణ్‌రెడ్డి, లాలామున్నా, వేదవ్యాస్, రాము, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

పనితీరు మార్చుకోకుంటే చర్యలే..

- మున్సిపల్ జవాన్‌లను హెచ్చరించిన కలెక్టర్ రాహుల్‌రాజ్
- పారిశుధ్య నిర్వహణ లోపంపై ఆగ్రహం



కాలనీవాసులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, చిత్రంలో మున్సిపల్ కమిషనర్ శైలజ

కైలాస్‌నగర్: పట్టణంలోని ఆయా వార్డుల్లో నిర్వహించే పారిశుధ్య కార్యక్రమాలను జవాన్‌లు నిత్యం పర్యవేక్షించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. పట్టణంలోని సుందరయ్యనగర్, రణదీవేనగర్ కాలనీల్లో పారిశుధ్య నిర్వహణ తీరును మున్సిపల్ కమిషనర్ శైలజతో కలిసి బుధవారం పర్యవేక్షించారు. ఆయా కాలనీల్లో కాలినడకన తిరుగుతూ డ్రెయినేజీలు, చెత్త సేకరణ, రోడ్ల పరిశుభ్రతను స్వయంగా పరిశీలించారు. మురుగుకాలువల్లో పోగయ్యే చెత్త, ఇతర వ్యర్థాలను వెంటనే తొలగించాలన్నారు. అలాగే రోడ్లపై, ముఖ్యకూడళ్లలో ఉన్న ఇసుకను తొలగించాలని సూచించారు. డ్రెయినేజీల్లో చెత్త వేయకుండా కాలనీవాసులకు అవగాహన కల్పించాలన్నారు. పర్యవేక్షణ లేకపోవడంతో పలుచోట్ల ఎక్కడి చెత్త అక్కడే కనిపిస్తుందని జవాన్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మెరుగుపర్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. నాలాలపై ఉన్న ప్లాట్‌లు విరిగిపోవడం, చెడిపోవడంతో ఇబ్బంది కలుగుతుందని పలువురు కాలనీవాసులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వాటిపై చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమాలలో మున్సిపల్ డిప్యూటీ ఈఈలు తిరుపతి, మహమ్మద్ యూనిస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

స్టేడియం నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

ఆదిలాబాద్: స్టేడియం నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియాన్ని సందర్శించిన ఆయన స్టేడియం ట్రాక్, స్విమ్మింగ్‌పూల్, జిమ్, క్రీడా పాఠశాలలను పరిశీలించారు. స్టేడియం నిర్వహణ వివరాలను జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట క్రీడా పాఠశాల శిక్షకులు భాస్కర్, స్విమ్మింగ్ కోచ్ కృష్ణ తదితరులున్నారు.

అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యం

- మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్



కళ్లద్దాలు పరిశీలిస్తున్న జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్‌టౌన్: అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని గాంధీనగర్‌లో బుధవారం కంటివెలుగు శిబిరాన్ని సందర్శించారు. కంటి పరీక్షల నిర్వహణ, మందులు, కళ్లద్దాల పంపిణీని పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే ఆయా వార్డుల్లో కంటివెలుగు శిబిరాలు నిర్వహిస్తున్నామని, అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో భారత జాగృతి జిల్లా అధ్యక్షుడు రంగినేని శ్రీనివాస్, కౌన్సిలర్ ఆవుల వెంకన్న, రామేశ్వర్, గణేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణ పరిధిలోని ఇందిరమ్మకాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ ప్రారంభించారు. కౌన్సిలర్లు, ఐసీడీఎస్ అధికారులతో కలిసి పూజ చేశారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం కాలనీలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు గుడ్లు, బాలమృతం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పర్వా, తదితరులు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్ చేస్తే జైలుకే

- డీఎస్పీ ఉమేందర్



మాట్లాడుతున్న డీఎస్పీ ఉమేందర్

ఆదిలాబాద్‌టౌన్: వాహనాల నంబర్ ప్లేట్లను ట్యాంపరింగ్ చేసే వారిపై మరింత కఠినంగా వ్యవహరిస్తామని ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్ అన్నారు. ఈ మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పట్టణంలోని టూటౌన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నంబర్‌ప్లేట్ లేని, పదేళ్లుగా రిజిస్ట్రేషన్ లేకుండా తిరుగుతున్న నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ లేని మూడు బైక్‌లను ఆర్టీవో అధికారులకు అప్పగించామన్నారు. నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్ చేసిన వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపిస్తామన్నారు. ట్రాఫిక్ చలాన్ల నుంచి తప్పించుకునేందుకు కొందరు ట్యాంపరింగ్ చేస్తున్నారని, దీని కారణంగా వేరే వాహనదారులకు జరిమానా పడుతున్నాయన్నారు. ఇలాంటి వాటిపై పలు ఫిర్యాదులు అందాయని, వాటిపై సీరియస్‌గా వ్యవహరిస్తున్నామన్నారు. వారం పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో టూటౌన్ సీఐ పురుషోత్తం, ట్రాఫిక్ సీఐ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ ప్రకటించాలని ఆందోళన



విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: పీఆర్‌సీతో పాటు పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ ఉద్యోగులు బుధవారం ఆందోళన చేపట్టారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మధ్యాహ్న భోజన విరామ సమయంలో విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ, పీఆర్సీ ప్రకటనలో సంస్థ వైఖరికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా బుధ, గురువారాల్లో నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే 3, 4 తేదీల్లో ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సత్తయ్య, అరుణ, గంగాధర్, మధుకర్, అరవింద్, అరుణ్‌కుమార్, షౌకత్‌అలీ, మోసిన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఆదిలాబాద్‌టౌన్: తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు బుధవారం ఆందోళన చేపట్టారు. ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న మాట్లాడుతూ, ఐసీడీఎస్‌కు నష్టం కలిగించే నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని రద్దు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలోని అంగన్‌వాడీ ఉద్యోగులకు గ్రాట్యూటీ చెల్లించాలని, వేతనంలో సగం పెన్షన్ నిర్ణయించాలన్నారు. టీచర్లతో సమానంగా అంగన్‌వాడీ ఉద్యోగులకు వేతనాలు, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. 2018లో కేంద్రం పెంచిన వేతనంతో పాటు ఎరియర్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం 20 డిమాండ్లతో కూడిన వినతిపత్రం అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నవీన్‌కుమార్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి.వెంకటమ్మ, సునీత, పార్వతి, పద్మ, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

అమరుల సాక్షిగా వర్గీకరణ సాధిస్తాం



అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరుల సాక్షిగా వర్గీకరణ సాధిస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ అరెల్లి మల్లేశ్ అన్నారు. స్థానిక అంబేద్కర్‌భవన్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వర్గీకరణ అమరులకు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 28 ఏళ్లుగా మందకృష్ణ నేతృత్వంలో ఎస్సీ వర్గీకరణ కోసం న్యాయబద్ధమైన పోరాటం జరుగుతుందన్నారు. ఈ ఉద్యమంలో ఎంతోమంది తమ జాతి కోసం ప్రాణాలను సైతం వదిలారన్నారు. వారి ఆశయాలను సాధించే దిశగా ఉద్యమిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు సూర్యకాంత్, శ్రీహరి, సునిల్, జితేందర్, రాజశేఖర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలి



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న పాయల్ శంకర్

ఆదిలాబాద్‌రూరల్: ప్రతి ఒక్కరూ చెడు వ్యాసనాలకు దూరంగా ఉండి ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. మండలంలోని చిన్న లోకారి గ్రామంలో బుధవారం చేపట్టిన హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

లక్ష్మణచాంద: అనారోగ్యంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... లక్ష్మణచాంద గ్రామానికి చెందిన గోనె వెంకన్న(52) కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురై బుధవారం ఉదయం గ్రామ సమీపంలోని గోదాము వద్ద ఒంటిపై డీజిల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య గంగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు.

దూడకు అరుదైన శస్త్ర చికిత్స



దూడకు ఆపరేషన్ నిర్వహిస్తున్న వైద్యులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని గాయత్రి గోశాలలో ఆవులు తోపులాటడంతో దూడకు కొమ్ముకుచ్చుకుని తీవ్రంగా గాయపడింది. దీంతో గాయపడిన దూడకు బుధవారం డాక్టర్లు ముక్తర్, శ్రీకర్, క్రాంతి ఆధ్వర్యంలో మూడు గంటలు శ్రమించి ఆపరేషన్ నిర్వహించారు. వారం రోజులపాటు దూడను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.

మంత్రిని కలిసిన ఐటీడీఏ పాలకవర్గ సభ్యులు



మంత్రిని సన్మానిస్తున్న పాలకవర్గ సభ్యులు

బోథ్: ఉట్నూర్‌లోని ఐటీడీఏ పాలకవర్గ సభ్యులు బుధవారం నిర్మల్‌లోని అటవీ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివాసీలు, గిరిజనుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సత్కరించారు. ఇందులో సభ్యులు మేస్రం భూమన్న, తులసీరాం, దేవన్న, తానాజీ, బాపురావ్, సీతారాం ఉన్నారు.

బాబ్లీ గేట్లు ఎత్తి నీటి విడుదల



బాబ్లీ ప్రాజెక్టు వద్ద ఇరు రాష్ట్రాల ఇరిగేషన్ అధికారులు

భైంసా: గోదావరి నదిపై మహారాష్ట్రలో నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను అధికారులు బుధవారం ఎత్తి నీటిని దిగువన తెలంగాణలోకి వదిలారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ, మహారాష్ట్ర నీటి పారుదల శాఖ అధికారులు నీటిని వదిలారు. ఏటా గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు తీర్చడంతోపాటు పశుపక్ష్యాదుల దప్పిక తీర్చేందుకు ఒకరోజు నీటిని విడుదల చేసి గేట్లు మూసివేస్తారు. సీడబ్ల్యూసీ ఈఈ శ్రీనివాస్‌రావు, నాందేడ్ ఈఈ ఏఎస్ చౌగలే, డీఈఈ ఆర్ఆర్ పాటదార్, ఎస్సారెస్పీ ఈఈ చక్రపాణి, ఏఈఈ వంశీ ఉన్నారు.

మూగజీవాల దాహార్తితీర్చేదెలా?

- గత ఏడాది 1120 పశువుల నీటి తొట్టీల నిర్మాణాలకు రూ.2.44కోట్ల నిధులు మంజూరు
- నిర్మాణాలు పూర్తయినవి 407 మాత్రమే
- లక్ష్యానికి దూరంగా నీటితొట్టీల నిర్మాణాలు



రాంపూర్‌లో నిరుపయోగంగా పశువుల నీటితొట్టి

బజార్‌హత్నూర్: వేసవికి ముందే జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. గత వేసవిలో గుక్కెడు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్న సంఘటనలు చూశాం. మూగ జీవాల పరిస్థితి మరి దారుణంగా ఉంది. వేసవిరాక ముందే వాగులు, కుంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ముందు జాగ్రత్తగా నూతన నీటి తొట్టీల ఏర్పాటు, నిరుపయోగంగా ఉన్న పాతవాటికి మరమ్మతులు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. పశువుల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం గ్రామాల్లో 1120 నీటితొట్టీల నిర్మాణాలకు 2022–23లో రూ.2.44కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరు చేసింది. వీటి నిర్మాణ బాధ్యతను స్థానిక సంస్థలకు అప్పగించింది. అయితే సదరు ప్రజాప్రతినిధులు ఇష్టానుసారంగా నీటి తొట్టీలను నిర్మించి వదిలేశారు. వాటిని నీటి సౌకర్యం లేనిచోట నిర్మించడంతో అవి మూగజీవాల దాహార్తిని తీర్చడం లేదు. ఆదిలాబాద్ జిల్లా మొత్తంలో పశువుల కోసం నిర్మించిన నీటి తొట్టీల పేరిట నిధులు దుర్వినియోగం అవుతుంటే పట్టించుకునేవారే కరువయ్యారు.

నిధుల మంజూరు...

జిల్లాలో వేసవి కాలం పశువుల దాహార్తిని తీర్చడానికి ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా 2022–23లో 17 మండలాలకు పశువుల నీటితొట్టీలు 1120 మంజూరు కాగా అందులో 407 మాత్రమే నిర్మించారు. మిగత 713 పనులు ప్రారంభం కాలేదు. నిర్మాణం పూర్తయినవి నాసిరకంగా నిర్మించడం, నీటి సదుపాయం ఏర్పాటు చేయకపోవడంతో చాలా గ్రామాల్లో వృథాగా మారాయి. పశుసంవర్ధక శాఖ లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు మొత్తం కలిపి 6.45లక్షల వరకు ఉన్నాయి. వీటికి వేసవిలో నీటి సదుపాయం ఏర్పాటు చేయాలంటే గ్రామాల్లో ఉండే నీటి తొట్టీలను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మూగజీవాల పట్ల నిర్లక్ష్యం...

వేసవి నేపథ్యంలో నిరూపయోగంగా ఉన్న నీటి తొట్టీలను వినియోగంలోకి తేవాల్సి ఉన్నప్పటికీ పశు సంవర్ధకశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు ఎవరికి వారు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. నీటి తొట్టీలకు మిషన్ భగీరథ పైపు లైన్ లేని చోట బోరు ఏర్పాటుతో పాటు విద్యుత్ కనెక్షన్ కల్పించడంలో దృష్టి సారించడం లేదు. వాగులు ఎండుతున్న దృష్ట్యా రానున్న రెండు నెలల్లో ఈ తీవ్రత మరింత పెరిగి మూగజీవాలకు ముప్పుతిప్పలు తప్పవని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం...



మా గ్రామంలో నిర్మించిన రెండు పశువుల నీటి తొట్టీలు నిరూపయోగంగా మారాయి. ప్రతీ సంవత్సరం వర్షాభావ పరిస్థితులతో వాగులో నీళ్లు ఎండిపోతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కరువై నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన పశువుల నీటి తొట్టిలు నాణ్యత లోపంతో పనికిరాకుండా పోయాయి. కొత్తవి నిర్మించాలి.

– రబ్బి రవికుమార్, చందునాయక్‌తండా

పశువులకు నీటి వసతి కల్పిస్తాం

జిల్లాలోని 17 మండలాల్లో గతంలో నిర్మించిన నీటి తొట్టీలను వినియోగంలోకి తెస్తాం. అవసరం ఉన్న గ్రామాల్లో నూతనంగా నిర్మించుటకు నిధులు మంజూరు చేస్తాం. ఇప్పటికే పంచాయతీల వారీగా నీటి తొట్టీల వివరాలు సేకరిస్తున్నాం. వేసవిలో మూగ జీవాలకు తాగు నీటి సమస్య కలగకుండా ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపడతాం.

– రవీందర్, అడిషనల్ పీడీ, డీఆర్‌డీఏ, ఆదిలాబాద్

అడవుల్లో మంటలు



దగ్ధమవుతున్న అడవి

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లి శివారులోని ఖానాపూర్–పెంబి వెళ్లే రహదారిలోని అడవిలో బుధవారం ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో ఎఫ్ఆర్‌వో వినాయక్ ఆదేశాల మేరకు అటవీ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేయించారు. కాగా అటవీ ప్రాంతంలో నిప్పుపెట్టిన వారు ఎవరో విచారణ చేసి చర్యలు తీసుకుంటున్నామని, వారి కోసం గాలిస్తున్నట్లు ఎఫ్ఆర్ఓ వినాయక్ తెలిపారు.

బాలికను వేధించిన యువకుడిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: బాలికను వేధించిన ఓ యువకుడిపై టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. ఎస్సై విష్ణు ప్రకాష్ వివరాల ప్రకారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లాండసాంగ్వికి చెందిన రాము అనే యువకుడికి, ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఓ బాలికతో పెళ్లి నిశ్చయమైంది. బాలికకు 16 ఏళ్లే ఉండటంతో 18 ఏళ్లు నిండాకే పెళ్లి చేయాలని ఇరు కుటుంబాల వారు నిర్ణయించారు. బాలిక కుటుంబ సభ్యులకు యువకుడి కుటుంబ సభ్యుల ప్రవర్తన నచ్చకపోవడంతో సంబంధాన్ని రద్దు చేసుకున్నారు. ఆ తర్వాత కూడా యువకుడు బాలికను ఫోన్‌లో వేధించడంతో బాలిక కుటుంబీకులు టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పిప్పల్‌కోటి రిజర్వాయర్ ముంపు రైతుల దీక్ష భగ్నం

- ఆమరణ దీక్ష చేపట్టిన మల్లేశ్‌ను ఆస్పత్రికి తరలింపు

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవుతున్న భూములకు పరిహారం చెల్లించాలని రైతులు నిర్మాణ స్థలంలో రిలే దీక్షలు చేపట్టిన సంగతి తెలిసిందే. కాగా మంగళవారం రైతుల దీక్షకు మద్దతుగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్ రైతులకు న్యాయం చేయాలని కోరుతూ దీక్ష శిబిరంలో ఆమరణ నిరాహార దీక్షకు దిగాడు. దీంతో బుధవారం ఉదయం జైనథ్ సీఐ నరేష్, ఎస్సై రాధిక సిబ్బందితో దీక్షా శిబిరానికి చేరుకున్నారు. దీక్ష విరమించాలని కోరారు. వారు వినకపోవడంతో మల్లేశ్‌ను బలవంతంగా తీసుకువెళ్లే క్రమంలో రైతులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. బలవంతంగా మల్లేశ్‌ను పోలీస్ వాహనంలో ఎక్కించి జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండడంతో పోలీసుల అదుపులోనే ఉంచుకున్నారు. దీంతో బాధిత రైతులు ఈ ఘటనపై తీవ్రంగా మండిపడుతున్నారు.



మల్లేశ్‌తో మాట్లాడుతున్న సీఐ నరేశ్, ఎస్సై రాధిక

రైతుల అర్ధనగ్న ప్రదర్శన

తాంసి: సాగు భూములు ముంపునకు గురవుతున్న రైతులకు పరిహారం చెల్లించాలని కోరుతూ బుధవారం అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. వారు చేపట్టిన దీక్షలు 16వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు అండగా నిలుస్తూ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే ఎకరానికి రూ.20లక్షల పరిహారం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో రైతులు భూమన్న, స్వామి, లస్మరెడ్డి, సంతోష్, నర్సింగ్. పెంటన్న, అశోక్, శంకర్ ఉన్నారు.



అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలుపుతున్న రైతులు

కలెక్టర్‌ను కలిసిన పిప్పల్‌కోఠి రైతులు

కై లాస్‌నగర్: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోఠి రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా భూములను కోల్పోతున్న రైతులు బుధవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి వారి సమస్యలను నివేదించారు. దీంతో స్పందించిన కలెక్టర్ ఎకరాకు రూ.8లక్షల చొప్పున పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. గురువారం మండల తహసీల్దార్ దీక్షా శిబిరం వద్దకు వచ్చి దీక్షలను విరమింపజేస్తారని భరోసా ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రైతులు స్వామి, నసీరుద్దీన్, నర్సింగ్, అశోక్, శంకర్ ఉన్నారు.

వందశాతం ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న దిలీప్‌కుమార్



హాజరైన ఆశ్రమ పాఠశాలల సిబ్బంది

ఉట్నూర్: పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు దిలీప్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లాల్లోని ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, హెచ్‌డబ్ల్యూవోలకు వచ్చే పదో తరగతి వార్షిక పరీక్షలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించేలా చూడాలన్నారు. వందశాతం ఫలితాల కోసం ప్రారంభించిన మిషన్ లక్ష్యం అమలు తీరును పాఠశాలల వారీగా అడిగి తెలుసుకున్నారు. మిషన్ లక్ష్యం అమలులో భాగంగా విద్యార్థుల అనుమానాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని సూచించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా రోజువారిగా పరీక్షలు నిర్వహించాలని కోరారు. విద్యార్థులకు నిర్దేశిత మోను ప్రకారం పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలన్నారు. సూపర్‌విజన్ డ్యూటీలకు హాజరు కాని సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఏసీఎంవో జగన్, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, హెచ్‌డబ్ల్యూవోలు పాల్గొన్నారు.

పనితీరు మెరుగుపరుచుకోవాలి

- ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ వెంకటేశ్వర్లు

ఆదిలాబాద్: ప్రతి ఉద్యోగి తమ పనితీరును మెరుగుపరచుకుని సంస్థ లాభాల బాట పట్టేలా కృషి చేయాలని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం ఆదిలాబాద్ డిపోను సందర్శించిన ఆయన విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ప్రతి ఉద్యోగి ఎంతో కష్టపడి పని చేస్తారని కితాబిచ్చారు. రీజియన్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రీజియన్ పరిధిలోని ప్రతీ డిపో లాభాలను ఆర్జించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. ఉద్యోగుల విధి నిర్వహణపైనే సంస్థ భవిష్యత్ ఆధారపడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ కే. జానీరెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం. సురేష్ చౌహాన్, డిపో మేనేజర్ కె. కల్పన, నిర్మల్, భైంసా, ఆసిఫాబాద్ డిపో మేనేజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.



సన్మాన సభలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

పురుగుల మందుతాగి ఒకరి ఆత్మహత్య



శంకర్(ఫైల్)

ఇంద్రవెల్లి: పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మండలంలోని మెండపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. దానకొండ శంకర్(45) బుధవారం ఇంటి నుంచి తన వ్యవసాయ చేనుకు వెళ్లి గుర్తు తెలియని పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. శంకర్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ విషయమై ఎస్సై సునీల్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు.

బకాయిలు చెల్లించని నాలుగు షాపులు సీజ్

కై లాస్‌నగర్: బకాయిలు చెల్లించని కారణంగా ఆదిలాబాద్ పట్టణంలోని నాలుగు షాపులను బల్దియా అధికారులు బుధవారం సీజ్ చేశారు. ఆస్తి పన్ను వసూళ్ల కోసం కమిషనర్ శైలజ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం శివాజీ చౌక్ ఏరియాలో దుకాణాలు తిరుగుతూ పెండింగ్ బకాయిలను వసూలు చేశారు. 2016–17 సంవత్సరానికి సంబంధించి రూ. 11.11 లక్షల బకాయిలు ఆన్‌లైన్‌లో చూపిస్తుందన్నారు. వాటిని చెల్లించని నాలుగు షాపులను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. వ్యాపారులు సకాలంలో బకాయిలను చెల్లించి బల్దియా అభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు. రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు, బిల్ కలెక్టర్లు ఉన్నారు.



షాపులను సీజ్ చేయిస్తున్న కమిషనర్ శైలజ

వీసీ ద్వారా వాంగ్మూలం నమోదు

ఆదిలాబాద్‌టౌన్: వరకట్నం వేధింపుల కేసులో నార్నూర్ మండలానికి చెందిన వివాహిత 2021లో మృతి చెందింది. ఈ కేసులో అప్పటి అడిషనల్ ఎస్పీ హర్షవర్ధన్ దర్యాప్తు అధికారిగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన సైబరాబాద్ డీసీపీగా పనిచేస్తున్నారు. దీంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్.సునీత ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేశారు.



వాంగ్మూలం నమోదు చేస్తున్న జిల్లా జడ్జి సునీత

జోరుగా బెల్లం, పటిక అమ్మకాలు

దండేపల్లి: గుడుంబా తయారీకి ఉపయోగించే బెల్లం, పటిక విక్రయాలు దండేపల్లి మండలం మేదరిపేట కేంద్రంగా జోరుగా సాగుతున్నాయి. కాసిపేట, కొండపూర్, ద్వారక, ధర్మరావుపేట, పెద్దపేట, శ్రీరాములపల్లె, లక్ష్మీకాంతపూర్, మాదాపూర్, లింగాపూర్, అల్లీ పూర్, గుడిరేవు, కళపెల్లి, బిక్కనగూడ, మామిడిపల్లి, కొత్తమామిడిపల్లి గ్రామాలతోపాటు గిరిజన గ్రామాలైన దమ్మన్నపేట, కంచరబాయి గ్రామాల ప్రజలు ప్రతినిత్యం మేదరిపేటకు వచ్చి నిత్యావసర వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. 15గ్రామాలకు ప్రధాన కూడలిగా ఉండడంతో అనేక రకాల దుకాణాలు ఉన్నాయి. మేదరిపేట సమీప గ్రామాల్లో కొందరు గుడుంబా తయారు చేస్తుండడంతో బెల్లం, పటిక అమ్మకాలు ఇక్కడ ఎక్కువగా సాగుతున్నాయి. పలువురు వ్యాపారులు బెల్లం, పటిక అమ్మకాలపై దృష్టి సారించి లోడ్‌ల కొద్ది తెప్పించి రహస్య ప్రాంతాల్లో నిల్వ చేసుకుని దుకాణాల్లో విక్రయాలు సాగిస్తున్నారు. అధికారుల తనిఖీలు నామమాత్రంగా ఉండడంతో అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

నీటి మడుగులో పడి ఒకరి మృతి

వాంకిడి: ప్రమాదవశాత్తు నీటి మడుగులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని సవాతి పంచాయతీ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై వివరాల ప్రకారం.. మండలంలోని సవాతి గ్రామ పంచాయతీ పరిధిలోని బండకాస గ్రామానికి చెందిన బిర్కుర్‌వార్ విలాస్ (50) కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం సోయం సోనేరావు అనే వ్యక్తి పంట చేనుకు వెళ్తుండగా వాగు మడుగులో విలాస్ మృతదేహం కనిపించింది. సమాచారం మేరకు పోలీసులు చేరుకుని పంచనామా నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు.



పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై సాగర్

మైత్రి కేంద్రాలకు దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఆదిలాబాద్ ఆధీనంలో మైత్రి కేంద్రాల ఏర్పాటుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా పశుగణాభివృద్ధి సంఘం సహాయ సంచాలకులు ఆర్.రామారావు తెలిపారు. మల్టీపర్పస్ ఆర్టిఫీషియల్ అన్సెమిషన్ టెక్నీషియన్ ఇన్ రూరల్ ఇండియా (ఎంఎఐటీఆర్ఐ) కింద కృత్రిమ గర్భధారణ కోసం శిక్షణ ఇప్పించి, సామగ్రి ఇవ్వడం జరుగుతుందని, గ్రామాల్లో రైతుల పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ చేయాల్సి ఉంటుందని, ఎటువంటి వేతనాలు ఉండవని, స్వయం ఉపాధి పొందవచ్చని చెప్పారు. జిల్లాలోని చెన్నూర్ మండలంలోని చింతపల్లి, భీమిని మండలంలోని గంగారాం, దుగ్నెపల్లి, సుద్దాల, తెనుగుపల్లి, కర్జీభీంపూర్ రాజరాం, జైపూర్ మండలంలోని ఇందారం, తాండూర్ పెగడపల్లి, నస్పూర్, చంద్రవెల్లి, జన్నారం మండలంలోని అబ్బాపూర్, కవ్వాల్‌లలో పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు 10వ తరతగతి ఉత్తీర్ణులై ఉండాలని, 18 నుంచి 35 సంవత్సరాల వయసు వారు కావాలని తెలిపారు. ఫొటోతో కూడిన స్థానిక నివాస ధృవీకరణపత్రం, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, అభ్యర్థులు సంబంధిత కేంద్ర సమీప గ్రామస్తులై ఉండాలని తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 13 సాయంత్రం 5 గంటలలోగా కార్యనిర్వహణ అధికారి/ సహాయ సంచాలకులు, పశు సంవర్ధశాఖ, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం కార్యాలయం, భుక్తాపూర్ ఆదిలాబాద్‌లో అందజేయాలని కోరారు.







దివ్యాంగులకు స్లాట్ కష్టాలు

జిల్లా కేంద్రంలో దివ్యాంగుల సదరం సర్టిఫికెట్లకు ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ కోసం అధికారులు డేట్ ప్రకటించారు. దీంతో జిల్లాలోని పలువురు దివ్యాంగులు సర్టిఫికెట్ కోసం బుధవారం మీసేవ కేంద్రాల వద్ద పడిగాపులు కాశారు. ఇతర మండలాల నుంచి కొందరు దివ్యాంగులు తమ సర్టిఫికెట్ రెన్యూవల్ కోసం వచ్చినప్పటికీ వారికి స్లాట్ బుకింగ్ దొరికే అవకాశం లేకపోయింది. కొన్ని మండలాల వారికే అవకాశం కల్పించడంతో పలువురు నిరాశకు గురయ్యారు. ఓ దివ్యాంగుడు రెన్యూవల్ కోసం తిరుగుతున్నా.. ఎవరు పట్టించుకోవడం లేదని తన బంధువులతో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశాడు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్